## క్లుప్తంగా

### 'కౌశలం' స్పెషల్ డ్రైవ్ సర్వే



పైన గ్రామంలో కౌశలం సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: కౌశలం సర్వే స్పెషల్ డ్రైవ్ ద్వారా వేగంగా చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలో పైన, గంగ్రేడు, కైకవోలు తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న కౌశలం( వర్క్ ఫ్రమ్ హోం) సర్వే ప్రక్రియను ఆయన ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న యువతీ యువకులు ఉద్యోగాలు చేసేందుకు సిద్ధంగా ఉన్న వారి జాబితా తయారు చేయుటకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ సర్వే చేస్తున్నారన్నారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ వారు ఉపాధి కల్పించేందుకు వర్క్ ఫర్ హోమ్ కార్యక్రమంలో భాగంగా వారి ప్రొవిజినల్స్ తీసుకుని సర్వే చేయాలని ఆదేశించామన్నారు. సచివాలయం అధికారులు, సిబ్బంది సర్వేలో పాల్గొన్నారన్నారు.

### తెలుగు ఉపాధ్యాయినికి జాతీయ పురస్కారం



సీతామహాలక్ష్మి

రంగంపేట: తమ పాఠశాలకు చెందిన తెలుగు భాష ఉపాధ్యాయిని డాక్టర్ శ్రీపాద సీతామహాలక్ష్మి 'గిడుగు' జాతీయ పురస్కారానికి ఎంపికైనట్టు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి తెలిపారు. సీతామహాలక్ష్మి రచించిన సాయి లీలామృతం హైదరాబాద్‌కు చెందిన గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్‌లో పరిశోధన జరిగిందని, అనంతరం జాతీయ పురస్కారానికి అర్హత సాధించిందన్నారు. నేడు హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించే గిడుగు జయంతి వేడుకలలో పరిశోధన విభాగంలో జాతీయ పురస్కారాన్ని సీతామహాలక్ష్మి అందుకుంటారని తెలిపారు. జాతీయ స్థాయిలో 20 మందికి ఇచ్చే ఈ పురస్కారాలలో తమ పాఠశాల ఉపాధ్యాయురాలు సీతామహాలక్ష్మికి దక్కడం అభినందనీయమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

### అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు



వెంకటరావు దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

పెదపూడి: విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని పెద్దాడ పీహెచ్‌సీ వైద్యులు డి.ప్రత్యూష అన్నారు. పెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన జి. వెంకటరావు వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో నిస్వార్ధ సేవలతో ప్రజలకు అందుబాటులో సేవలందించాలన్నారు. అప్పుడు ప్రజల నుంచి మంచి ఆదరణ అభిమానాలు పొందుతారన్నారు. అనంతరం సన్మాన గ్రహీత దంపతులకు శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు బి.సురేఖ, ఎ.వీ.పద్మావతి, చంద్రారెడ్డి, సిబ్బంది బి.సుకుమార్, డి.మురళీ, టీ.నాగేశ్వరరావు, పీహెచ్ఎన్ డి.అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాభివృద్ధికి శంభాజీరావు జీవితం అంకితం



శంబాజీరావుకు నివాళులర్పిస్తున్న వేణు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామాభివృద్ధే తన జీవిత ఆశయంగా మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభాజీరావు కృషిచేశారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ కొనియాడారు. ఆదివారం ఆయన బొమ్మూరులోని శంబాజీరావు భార్య మాజీ సర్పంచ్ గంగాభవానీ, కుమారుడు చంద్రమౌళి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. శంబాజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న సమయంలో మాజీమంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సిఫార్సుతో బొమ్మూరు గ్రామంనకు శంభాజీరావు లక్షలాదిరూపాయలు మంజూరు చేయించుకుని గ్రామాభివృద్ధికి విశేషకృషి చేశారన్నారు. ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, జిల్లా కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు టికె. విశ్వేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ నిమ్మలపూడి రామకృష్ణ, బొప్పన చినరాజు శంబాజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

# అప్రమత్తతే ఆయుధం

- గ్రామాల్లో జోరందుకున్న నిమజ్జనాలు
- ప్రమాదాలకు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు



పందలపాకలో నిమజ్జనం చేస్తున్న భక్తులు (ఫైల్)



బిక్కవోలు క్రేన్ సహాయంతో నిమజ్జనం చేస్తున్న దృశ్యం (ఫైల్)

బిక్కవోలు: గణపతి నవరాత్ర ఉత్సవాలు వాడవాడలా వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో విగ్రహాల నిమజ్జనోత్సవాలు జోరందుకున్నాయి. వినాయక విగ్రహాల నిమజ్జనాల సందర్భంగా ఏటా ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అందుకే ఈ ఏడాది ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పూర్తి స్థాయిలో కమిటీ నిర్వాహకులే బాధ్యత తీసుకోవాలని పోలీసులు చెబుతున్నారు. అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట, మండాలల్లో సుమారు 480 గణపయ్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. వాటిలో చాలా విగ్రహాలను సామర్లకోట కాలువ, తుల్య భాగ నదిలో నిమజ్జనం చేస్తారు. వినాయక ప్రతిమల ఊరెగింపు వరకూ సజావుగానే జరుగుతున్నా నిమజ్జనం కోసం విగ్రహాలను నీళ్లలోకి దింపే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భారీ విగ్రహాలు చాలా బరువు ఉండడంతో వాటిని నదిలో విడిచేందుకు దుందుడుకుగా వ్యవహరించడం, అజాగ్రత్తగా ఉండడంతో అనుకోని ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. 2018లో అనపర్తి వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి వెళ్లిన బీసీ హాస్టల్ విద్యార్థి ములగపాక శివరామ సంతోష్(13) కాలువలో గల్లంతయ్యాడు. అదే ఏడాదిలో వినాయక చవితి కాలువ స్నానం చేయడానికి వెళ్లిన వెదురుపాక చెందిన విద్యార్థి దుర్గాప్రసాద్ కొంకుదురు బుడితల మామిడి వద్ద కాలువలో మునిగి చనిపోయాడు. గత ఏడాది తొస్సిపూడి వద్ద కొమరిపాలెం గ్రామానికి చెందిన తేతలి నాగ వీర వెంకట రామారెడ్డి(20) యువకుడు నిమజ్జనంలో గల్లంతై మృతి చెందాడు. ఈ ఏడాది 7న చంద్రగహణం కారణంలో 6వ తేదీన నిమజ్జనం ఎక్కువ జరిగుతాయి.

**నిమజ్జన సమయంలో..**

గతంలో నిమజ్జనం సందర్భంగా చోటుచేసుకున్న పలు సంఘటనలను పరిశీలిస్తే.. కాలువల లోతు స్థితిగతులు తెలియక ప్రమాదాల బారిన పడుతున్నట్టు స్పష్టమవుతోంది. అలాంటివి జరగకుండా కర్రల సాయంతో లోతును గుర్తించిన తరువాతే కాలువలోకి దిగడం మంచిదని పెద్దలు సూచిస్తున్నారు. భారీ బరువున్న విగ్రహాలను వాహనాల నుంచి దించే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. వాటిని క్రేన్ల సహాయంతో నీళ్లల్లో దించడమే మేలని చెబుతున్నారు. విగ్రహాల నిమజ్జన ప్రదేశం వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. చిన్నారులు, పిల్లలను నిమజ్జన ప్రదేశాలకు దూరంగా ఉంచాలి.

**బాణసంచాతో జాగ్రత్త**

ఎంత ఎక్కువ బాణసంచా కాల్చితే అంత గొప్పగా భావిస్తున్న ఉత్సవ కమిటీలు వాటిని కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. సరదా కోసం పిల్లలు కూడా బాణసంచా కాల్చేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నందున వారిని బాణసంచాకు దూరంగా ఉంచాలి. మందుగుండు సామగ్రినంతటినీ ఒకే వాహనంపై ఉంచే ప్రయత్నం చేయకూడదు. జన వాసాల వద్ద, రద్దీ కూడళ్లలో ఆస్పత్రుల వద్ద బాణసంచా కాల్చడం మంచిది కాదు. అనర్థాలకు దారితీస్తుంది.

> **ఉత్సవ కమిటీల పర్యవేక్షణ**
>
> గణపతి నిమజ్జన కార్యక్రమాలను ఉత్సవ కమిటీలు దగ్గరుండి పర్యవేక్షించాలి. వారిదే పూర్తి స్థాయి బాధ్యత. పిల్లల్ని నిమజ్జనం వద్దకు రానీయకూడదు. బాణసంచా విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా పోలీసు శాఖ సూచించిన నిబంధనలు విధిగా పాటించాలి. ఈ ఏడాది 6వ తేదీన ఎక్కువ నిమజ్జనాలు ఉండడం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం. అయితే ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.
>
> – వాసంశెట్టి రవి చంద్ర కుమార్, ఎస్సై, బిక్కవోలు

### ధర్మేష్‌కు తెలుగు తేజం పురస్కారం



ధర్మేష్‌ను సన్మానించి, అవార్డును అందిస్తున్న శ్రీకళావేదిక చైర్మన్ డాక్టర్ ప్రతాప్ తదితరులు

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన యువ కవి, విద్యా, సామాజిక సంస్కర్త నక్కిన ధర్మేష్ తెలుగు తేజం పురష్కారం ఆదివారం అందుకున్నారు. పల్నాడు జిల్లా నరసారావుపేటలో భువనచంద్ర టైన్ హాల్లో ధర్మేష్‌కు అంతర్జాతీయ సాంస్కృతి సంస్థ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షుడు ఈశ్వరీ భూషణం, ప్రాచీన కవుల వారసులు, ప్రముఖులు సమక్షంలో తెలుగు తేజం అవార్డును గజమాల, జ్ఞాపిక, అవార్డు పత్రంతో ఘనంగా సత్కరించారు. ప్రతి ఏటా అంతర్జాతీయ సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక అందించే అత్యంత ప్రతిష్టాత్మక పురస్కారాన్ని తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న ప్రతిభావంతులకు ప్రదానం చేస్తారు. ఈ అవార్డు ధర్మేష్ అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని వైఎస్సార్ సీపీ సర్పంచ్ మెల్లిమి రామచంద్రరావు, గ్రామ పెద్దలు, కవులు, సాహితీవేత్తలు అన్నారు. ధర్మేష్ మాట్లాడుతూ ఈ పురస్కారం నా బాధ్యత మరింతగా పెంచిందని, అమ్మ భాష తెలుగు అక్షరమై వెలగాలి, తెలుగు భాషా పరిరక్షణకు, అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

## మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాదం బాలకృష్ణ

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ శిబిరాన్ని ఫ్యామిలీ హెల్త్ క్లబ్‌లో నిర్వహించారు. శిబిరాన్ని పూర్వపు 316బీ జిల్లా గవర్నర్ లయన్స్ డాక్టర్ బాదం బాలకృష్ణ, జిల్లా ఉప గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్ ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథులు లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శిబిరంలో వైద్యు నిపుణులు కర్రి ప్రీతి, పి.ప్రశాంతి, కర్రి శ్రావ్య, ఆర్ఎల్ చైతన్య తదితరులు గుండె, ఎముకలు, డయాబెటిక్, జనరల్ మెడిసిన్, కంటి, స్త్రీల గర్భ కోశ వ్యాధి, సంతాన సాఫల్యం మొదలగు వాటికి సంబంధించి సుమారు 282 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్ల జోళ్లు పంపిణీ చేశారు.

## ఆరుద్రకు ఘన నివాళి



దొడ్డిగుంటలో ఆరుద్ర చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అభిమానులు

రంగంపేట: సినీగేయ రచయిత, సాహితీ వేత్త దివంగత ఆరుద్ర శత జయంతిని దొడ్డిగుంట గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ విశ్లేషకుడు అడబాల మరిడయ్యకాపు ముందుగా ఆరుద్ర చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుద్ర సాహితీ రంగానికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఆరుద్ర 150 సినిమాలకి మాటలు, 500 చిత్రాలలో 4వేల పాటలు రాసారన్నారు. గణపతి అలయ కమిటీ చైర్మన్ వెలమర్తి వెంకటేశ్వరరావు, పేపకాయల వెంకన్న, మల్లెల సత్యనారాయణ, నాగేశ్వరరావు, రాజు, చిరంజీవులు, చిన్నోడు, విష్ణు, మరిడియ్య, బూరయ్య పాల్గొన్నారు.

## బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్ గణేష్‌బాబు

పెదపూడి: బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అందరు ఐక్యతగా ముందుకు సాగాలని రాష్ట్ర 93 బీసీ కులాల అధ్యక్షుడు మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు అన్నారు. గంగ్రేడు గ్రామంలో ఉమమహేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 'వనమహోత్సం' మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు, భాస్కర్ గణేష్‌బాబు, మాల మహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ అల్లం వెంకటదాన మెంటారావు, నియోజకవర్గం రజక చైతన్య సేవా సంఘం కన్వీనర్ మురమళ్ల వెంకటరమణ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మందపల్లి సత్యనారాయణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ , కాటన్‌దొర, దివంగత మాజీ సీఎం ఎన్టీ రామారావు విగ్రహాలకు, చాకలి ఐలమ్మ, గాడ్సేబాబా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఉమామహేశ్వర రజక సంఘం కార్యాలయం ప్రారంభించారు. సిద్ధాంతుల కొండబాబు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీల పౌర హక్కులు, స్వేచ్ఛ, రాజకీయంగా రావాల్సిన పదవుల కోసం సమష్టిగా పోరాడాలన్నారు. సర్పంచ్ కుడిపూడి మాధవీలత, మాజీ ఎంపీపీ జుత్తక సూర్యకుమారి, స్థానికులు పాల్గొన్నారు.

# బీసీల పక్షపాతి సూర్యనారాయణరెడ్డి

**వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి ముత్యాలరావు**



అనపర్తిలో విలేకరులతో మాట్లాడుతున్న ముత్యాలరావు తదితరులు

అనపర్తి: నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బీసీల పక్షపాతి అని ఎమ్మెల్యేగానే కాకుండా తన వైద్య సేవల ద్వారా కూడా వారి అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప వైద్యుడు, నాయకుడని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి బొడ్డు ముత్యాలరావు పేర్కొన్నారు. ఆదివారం అనపర్తి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పొలమూరు గ్రామంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బీసీ వర్గానికి చెందిన మహిళా సర్పంచ్ గుడాల ధనలక్ష్మికి జరిగిన అవమానానికి నిరసిస్తూ ఆమెకు మాజీ శాసన సభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బాసటగా నిలిచారన్నారు. అయితే కూటమికి చెందిన బీసీ నాయకులు దీనిని కపట ప్రేమగా అభివర్ణించడం దారుణమని కేవలం రాజకీయాల కోసం కూటమి బీసీ నేతలు అలా మాట్లాడడం సమంజసం కాదని ముత్యాలరావు అన్నారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లలోను కరోనా పోను కేవలం రెండున్నరేళ్లలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి బీసీల కోసం 36 పైగా కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా చినపాలమూరులో శెట్టిబలిజ సామాజిక వర్గానికి కోటిన్నరతో అత్యాధునిక కల్యాణ మండపాన్ని నిర్మించిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. ఇవన్నీ కూడా నియోజకవర్గంలో రికార్డ్‌గా నిలిచాయన్నారు. అంతేకాక పార్టీలు, వర్గాలు అని చూడకుండా నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు టీడీపీ కీలక బీసీ నాయకులకు స్వయంగా పెన్షన్ మంజూరు చేసిన ఉదారత ఆయనదని వివరించారు. దోమాడ గ్రామంలో అన్యాయంగా తెల్లవారు జామున కూటమి ప్రభుత్వం బీసీల ఇళ్ల కూల్చి వేస్తే వారికి అండగా ఉండి పోరాడి బాధితులకు లబ్ధి చేకూరేలా చేసిన ఘనత డాక్టర్ సూర్యనారాయణరెడ్డికే దక్కుతుందని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో పొలమూరు, ఇల్లపల్లి, గంగ్రేడు సర్పంచ్‌లు గుడాల ధనలక్ష్మి, లొల్ల భద్రం, కుడిపూడి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, ఎంపీటీసీ కొండేటి భీమేష్, వార్డు సభ్యులు వాసంశెట్టి కోటేశ్వరరావు, నాయకులు గండి వాసు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి మరింత ఉధృతం

- ఆందోళన చెందుతున్న ప్రజలు
- అప్రమత్తమైన అధికారులు
- బొబ్బిల్లంక, ములకల్లంకలను పరిశీలించిన తహసీల్దార్



బొబ్బిల్లకం - ములకల్లంక మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

సీతానగరం: అఖండ గోదావరి వరద మరింత ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య వరద నీరు పరవళ్లు తొక్కుతోంది. దీంతో బొబ్బిల్లంక, ములకల్లంక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ బొబ్బిల్లంక రేవు వద్దకు చేరుకుని గోదావరి వరదను పరిశీలించారు. బొబ్బిల్లంక నుంచి బోటుపై ములకల్లంక చేరుకున్నారు. ములకల్లంక వాసుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. గోదావరి వరద మరింత ఉధృతం అయితే తొర్రేడు జిల్లా పరిషత్ హైస్కూల్ పునరావాసం కేంద్రం ఏర్పాటు చేశామని అక్కడకు తరలి వెళ్లాలని కోరారు. ములకల్లంకలో పారిశుధ్యంపై ఆరా తీశారు. అదే విధంగా తాగునీటి సమస్య ఏమైనా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. వీధుల్లో బ్లీచింగ్ జల్లాలని, పంచాయతీ అందించే నీటిని క్లోరినైజేషన్ చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ములకల్లంక, బొబ్బిల్లంకల్లో 24 గంటల వైద్యశిబిరాలను ఉండాలని, మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ములకల్లంక వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేసినా వాళ్లు పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు అంగీకరించడం లేదన్నారు. గోదావరి వరద మరింత ఉధృతి అయితే వారిని అక్కడ నుంచి తరలిస్తామన్నారు.ఎప్పటికప్పుడు వరద సమాచారం తెలుసుకుని తగు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ శ్రీనివాస తెలిపారు.



బొబ్బిల్లంక రేవులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించిన తహసీల్దార్ శ్రీనివాస్

# గంగమ్మ ఒడికి గణపయ్య..



పందలపాకలో బాల గణపతి ఊరేగిస్తున్న చిన్నారులు



కాలువలో బొజ్జగణపయ్యను నిమజ్జనం చేస్తున్న మహిళలు, చిన్నారులు

బిక్కవోలు: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు మండలంలోని పందలపాక, ఆర్ఎస్‌పేట, బలభద్రపురం దేవాలయంలో బొజ్జ గణపయ్య నిమజ్జనం ఘనంగా జరిగింది. పందలపాక వెలంపేట కట్టమ్మ తల్లి ఆలయం వద్ద ఉన్న బాల గణపతికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం చిన్నారులు, మహిళలు, యువకులు కలిసి తీన్‌మార్ డప్పులతో అందంగా అలంకరించిన వాహనంలో స్వామివారిని ఉంచి ఊరేగింపుగా తీసుకెళ్లి తల్లి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. పోలీసులు ఎలాంటి అవాంచనీయ సంఘటన రాకుండా పర్యవేక్షించారు. తొస్సిపూడి, కొమరిపాలెం గణపతి ఆలయాల్లో అన్నసమారాధన చేశారు.

**సామూహిక సరస్వతి పూజలు**

రంగంపేట: గ్రామంలోని హనుమాన్ జంక్షన్ వద్ద గణపతి ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో సామూహిక సరస్వతి పూజలు నిర్వహించారు. ఈ సామూహిక సరస్వతి పూజల్లో మహిళలు, విద్యార్థులు పాల్గొని పూజలు చేశారు. మండపంలోని గణపతిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు పూజలో ఉంచిన నోటు పుస్తకాలు, పెన్నులు విద్యార్థులకు పంపిణీ చేశారు.

**గణేశ్ లడ్డూ వేలం**

రాజానగరం: స్థానిక ఎస్‌కేఆర్ స్మార్ట్ సిటీలో తొలిసారిగా నిర్వహించిన వినాకయ చవితి ఉత్సవాల్లో గణేశ్ విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను వేలం వేశారు. ఆదివారం స్వామివారి చేతిలో ఉంచిన లడ్డూను అదే ప్రాంతానికి చెందిన ఎం.యశ్వంతరావు రూ.3,500 వేలం పాట పాడుకుని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధనను నిర్వహించి, సాయంత్రం గణేశుని ప్రతిమను ఊరేగింపుగా తీసుకువెళ్లి చాగల్నాడు కాలువలో నిమజ్జనం చేశారు.

**రామవరంలో గణపతి నిమజ్జనం**

అనపర్తి: రామవరం గ్రామంలోని మూల వీధికి చెందిన చిన్నారులు మొదటిసారిగా ఏర్పాటు చేసిన బాల గణపతిని ఆదివారం నిమజ్జనం చేశారు. చవితి ఉత్సవాలను చిన్నారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అనపర్తి: అర్షధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 22వ శ్రీవరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఎంఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మల్లిడి అనంతరెడ్డి, మాధవీలత దంపతులతో పూజా కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ పీఠం నిర్వాహకులు జ్యోతిష్య పండితులు రెడ్డి సీతారామశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. మల్లిడి నారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ చింతా ప్రకాష్‌రెడ్డి, ప్రచార పరిషత్ సభ్యులు, సాయిబాబా ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



రంగంపేటలో సరస్వతీ పూజలు చేస్తున్న భక్తులు



వేలంలో గణేష్ లడ్డూను సొంతం చేసుకుంటున్న పాటదారులు



రామవరంలో గణపతిని ఊరేగిస్తున్న చిన్నారులు



వినాయక నవరాత్ర పూజల్లో పాల్గొన్న భక్తులు